అంగన్వాడీ.. బోధన తడబడి

- కేంద్రాలకు సరఫరా కాని పాఠ్య పుస్తకాలు
- మూడు నెలలుగా నిర్లక్ష్యం



అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాబోధన

రాయవరం: అంగన్వాడీ చిన్నారులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. అంగన్వాడీ కేంద్రాలు తెరచి నెలలు గడుస్తున్నా పాఠ్య పుస్తకాలు అందించకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా పాత పుస్తకాలతోనే బోధనలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలు ఆయా కేంద్రాలకు అందజేసేది. నాలుగు పుస్తకాలతో కూడిన బర్స్–1, బర్స్–2 కిట్లను అందించింది. వీటితో పాటు అంగన్వాడీల్లో ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ మాదిరిగా ఇంగ్లీషులో పాఠాలు బోధిస్తుంటే కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. బోధనలకు సంబంధించి మూడేళ్ల లోపు చిన్నారులకు ఇంగ్లీషు, గణితం, స్పోకెన్ ఇంగ్లీషు, యాక్టివిటీ డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–1 కిట్లు అందజేసేవారు. నాలుగేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు కలిగిన చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–2 కిట్లను అందించేవారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభమై మూడు నెలలు అవుతున్నా పాఠ్య పుస్తకాల పంపిణీ ఊసే లేకుండా పోయింది.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 419 అంగన్వాడీ కేంద్రాలు, ఆరు మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 8,791 మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు నెలలు కావస్తున్నా అంగన్వాడీ కేంద్రాల వైపు దృష్టి సారించలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. అంగన్వాడీ కేంద్రాలకు పీపీ–1, పీపీ–2 పుస్తకాలు అందకపోవడంతో అంగన్‌వాడీ వర్కర్లు పాత పుస్తకాలతోనే బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయినా ఇంకా పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం అందించలేదు. గత ప్రభుత్వం సకాలంలో పుస్తకాలను అందిచడంతో పాటు వాటిలో చిన్నారులకు ఎంతో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండడంతో తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అంగన్వాడీ కేంద్రాలకు తమ చిన్నారులను పంపించేవారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త పుస్తకాలను అందించకపోవడంతో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధనకు ఎటువంటి ఆటంకం లేదు. కార్యకర్తలు ఎప్పటి మాదిరిగానే బోధన చేస్తున్నారు. నూతన పాఠ్య పుస్తకాలకు ఇండెంట్ కూడా తీసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులకు కూడా పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాం.

– వీవీ వరాహలక్ష్మి, పీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, రామచంద్రపురం

విద్యా బోధనకు ఢోకా లేదు



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఢోకా లేదు. ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న పాఠ్య పుస్తకాలు విద్యాబోధనకు సరిపోతోంది. త్వరలో కొత్త పుస్తకాలు రానున్నాయి. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యాబోధన విధానాన్ని ప్రతిరోజు టైమ్ టేబుల్‌గా అన్ని కేంద్రాలకు పంపించాం. అంగన్వాడీ వర్కర్లు చిన్నారులకు పాఠాలు, ఆటల ద్వారా విద్యను బోధిస్తున్నారు.

– అధికారి గజలక్ష్మి, పీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, మండపేట

క్లుప్తంగా

డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీం తనిఖీ



ద్రాక్షారామలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్ల పనితీరుపై సమీక్షిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ గ్రామ సచివాలయ పరిధిలో వైద్య ఆరోగ్య శాఖ డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీం మంగళవారం తనిఖీ నిర్వహించారు. టీం సభ్యులు డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పీబీఎల్ కుమారి, నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ రవి, డిస్ట్రిక్ట్ డేటా మేనేజర్ మోహన్‌లు ద్రాక్షారామ–1 సచివాలయ పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్ల పనితీరుపై సమీక్షించారు. గర్భిణులు, బాలింతల నమోదు, వారికి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులు సక్రమంగా ఆన్‌లైన్ చేస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నార్ని గంగాధర్, వరలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కేసు పెట్టిన భార్య: భర్త అదృశ్యం

మామిడికుదురు: భార్య కేసు పెట్టిందని భయపడి భర్త ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఈ సంఘటన పాశర్లపూడిలో జరిగింది. నగరం హెడ్ కానిస్టేబుల్ కేఎన్‌డీ ప్రసాద్ తెలిపిన వివరాలిలా.. పాశర్లపూడికి చెందిన వేగి వెంకటరత్నంకు 2021లో పేరూరుకు చెందిన పావనితో వివాహం జరిగింది. అప్పటి నుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పది రోజుల క్రితం పావని ఫిర్యాదుపై నగరం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కానీ మళ్లీ ఇద్దరి మధ్య గొడవ జరగడంతో పావని పుట్టింటికి వెళ్లిపోయింది. భర్తపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భార్య కేసు పెట్టిందని భయపడిన వెంకటరత్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై అతడి తండ్రి వెంకటేశ్వరరావు చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ మంగళవారం తెలిపారు.

తాగునీటి కుళాయి నుంచి చేప పిల్ల



మామిడికుదురులో తాగునీటి కుళాయి నుంచి వచ్చిన చేప పిల్ల

మామిడికుదురు: మామిడికుదురు గ్రామంలో తాగునీటి కుళాయిల నుంచి తరచు చేప పిల్లలు రావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కుళాయి వాటర్ పట్టగా ఆ వాటర్‌లో చేప పిల్ల వచ్చిందని స్థానికులు రుద్రా శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల వ్యవధిలో మూడు సార్లు కుళాయిల నుంచి చేప పిల్లలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు ఇలా కలుషితం అవుతుంటే ఎలా తాగేదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి తాగునీటిలో చేప పిల్లలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీని వివరణ కోరగా దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా భారీ ఉద్యమం

మామిడికుదురు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా భారీగా ఉద్యమించాలని మామిడికుదురులో జరిగిన నాలుగు మండలాల మాల మహానాడు నేతల సమావేశం తీర్మానించింది. మాల మహానాడు సీనియర్ నేత నల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఈ నెల 21న తలపెట్టిన భారత్ బంద్ ద్వారా మాలల సత్తా చూపించాలన్నారు. భారత్ బంద్ విజయవంతం చేయడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ కోసం కోర్ కమిటీలను ఏర్పాటు చేశారు. సమావేశంలో మట్టా సత్తిబాబు, తాడి సహదేవ్, చోటే రాజేష్, మట్టా సురేష్, బొంతు మణిరాజు, కలిగితి పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు 20 వరకు గడువు

అంబాజీపేట: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించి అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్, పదో తరగతిలో అడ్మిషన్లకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉందని నిర్వాహకుడు నందిక వెంకటేశ్వరరావు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9912703454లో సంప్రదించాలన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ సేవ

అంబాజీపేట: నందంపూడి గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి తీర్థంలో భాగంగా కాపు సామాజిక వర్గీయులు అమ్మవారి పూజాఘటాలను మంగళవారం పురవీధుల్లో ఊరేగించారు. రోజువారీ సామాజిక వర్గాల్లో భాగంగా అమ్మవారి సేవ అత్యంత ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజా ఘటాలకు మహిళలు హారతులు పట్టి, పొన్నుపులు నిర్వహించారు.

ఎదురుబిడియం కొంపలకు దారేదీ?



గతుకుల మయంగా మారిన ఎదురుబిడియం కొంపలు రహదారి

కె.గంగవరం: మండలంలోని కుడుపూరు శివారు ఎదురుబిడియం కొంపలు గ్రామానికి దారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామంలో సుమారు 70 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కుడుపూరు గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఎదురుబిడియం కొంపలు గ్రామం ఉంది. ఈ గ్రామానికి పంట చేలో నుంచి ఉన్న కంకర రహదారే దిక్కు. పంట చేలో నీరు రోడ్డుపైకి వచ్చి కనీసం నడవడానికి కూడా ఉండడం లేదని వర్షాకాలంలో అయితే గ్రామానికి రాకపోకలు ఉండవని స్థానికులు చెబుతున్నారు. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే ఎత్తుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వారు ఆవేదన చెందుతున్నారు. గ్రామాలు అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో కూడా కనీసం రోడ్డు కూడా లేకపోవడం చాలా దారుణమని గ్రామస్తులు వాపోతున్నారు. గత 15 ఏళ్లుగా ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుకన్నామని ఇప్పుడైనా అధికారులు గ్రామాన్ని గుర్తించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి



కాజులూరులో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లపై చర్చిస్తున్న నాయకులు

కాజులూరు: ఈ నెల 16 శుక్రవారం జరగనున్న భాతర మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ మహిళా కార్యదర్శి, జగన్నాథగిరి ఎంపీటీసీ కొప్పన లక్ష్మి అన్నారు. గ్రామంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరవెంకటసత్యనారాయణ (వీరబాబు) అధ్యక్షతన మంగళవారం కార్యకర్తలు, నాయకులు సమావేశమై విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ 16వ తేదీ ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సోము వీర్రాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. నియోజకవర్గ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజి, గండి బాబ్జి, పుణ్యమంతుల ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలపై శ్రద్ధ చూపాలి



దంగేరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు

కె.గంగవరం: గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను సేకరించి దాని ద్వారా సంపద సృష్టించే విధంగా సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఈవోపీఆర్డీ నాగేంద్ర అన్నారు. మండలంలోని దంగేరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఫీల్డ్ విజిట్‌లో భాగంగా సర్పంచ్‌లతో కలసి ఆయన సందర్శించారు. మూడు రోజుల ట్రైనింగ్‌లో భాగంగా నేడు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించి ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లు ప్రయత్నించాలన్నారు. చెత్తను సేకరించి కేంద్రాల వద్దకు చేర్చి ఎరువుగా మార్పు చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. దీంతో పాటు తయారైన ఎరువు కూడా పంటలకు, మొక్కలకు మంచి చేకూరుస్తుందన్నారు. మండల వ్యవసాయశాఖాధికారి బలుసు రవి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేసేలా రైతులను సమాయత్తం చేయాలని కోరారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంట పండించి ఆర్థికంగా ఎదుగొచ్చన్నారు. ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ రమణ, సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై సర్పంచ్‌లకు శిక్షణ



వెల్లలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి శిక్షణ ప్రారంభించిన దృశ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్క్రూటినీ, స్ట్రీట్ లైట్స్(ఎల్ఈడీ) తదితర అంశాలపై మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా రెండో రోజు వెల్ల గ్రామంలో చెత్త సంపద కేంద్రం నిర్వహణ, ఆవశ్యకతలపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు చేతుల మీదుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాల వేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాస్టర్ ట్రైనర్స్ రాయుడు మోహనవీవీ నాగ ఈశ్వరరావు(మోహన్), వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, పిల్లి త్రినాథ్, సుందర్‌లాల్ అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా గ్రామాల్లో చెత్త సమస్యలకు పరిష్కారం చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, గ్రామ ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, మండలంలోని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడింది కోడిపందేలు కాని.. పేకాటగా కేసు నమోదు

ఆలమూరు: మండలంలోని మోదుకూరులో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై మంగళవారం దాడి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామ శివార్లలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకోగా మిగిలిన వారు పరారయ్యారు. అదుపులోకి తీసుకున్న వారిలో గొడితి రాజు, పీవీవీ సత్యనారాయణ, కొవ్వాడ నవీన్, గంధం విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ నిందితుల వద్ద నుంచి రూ.2900 స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులంతా గత వారం రోజుల నుంచి కోడి పందేలు నిర్వహిస్తున్నారని చెబుతుంటే పోలీసులు మాత్రం పేకాట శిబిరంపై దాడి చేసి నిందితులను అరెస్ట్ చేశామని చెబుతున్నారు. పేకాట శిబిరంపై దాడి చేసి ఆ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కేసును నమోదు చేసినట్లు ఎస్సై ఎం.అశోక్ పేర్కొన్నారు.

అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్లే!

అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్లే కోడి పందేల కేసును పేకాట కేసుగా మార్పు చేశారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కోడి పందేలు ఆడుతున్న సమయంతో కోళ్ల లభ్యం కాకపోవడం లేదా ఉద్దేశ పూర్వకంగా కేసును నీరుగార్చేందుకు కోళ్లను వదిలేయడం కాని జరిగి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీంతో కేసు తీవ్రతను తగ్గించేందుకు పోలీసు అధికారులు కేసును మార్చివేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోడిపందేల స్థావరంపై దాడి చేసిన సంఘటన సమయంలో అనేక ద్విచక్ర వాహనాలు ఉన్నా వాటిని అదుపులోకి తీసుకోకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తుంది.

సుందరకాండ పారాయణ

అమలాపురం రూరల్: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ లోక కల్యాణం కోసం అమలాపురంలో మహిపాల వీధిలో వేంచేసిన లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా పలువురు భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణ నిర్వహించారు. రామానంద స్వామి శిష్యుడు సుబ్బారావు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ పారాయణ నిర్వహించారు. అర్చకుడు ఈమని సాయికృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధి చిక్కం కృష్ణ పాల్గొన్నారు.

185.936 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం

- నష్ట పరిహారం రూ.36,05,264 చెల్లించాలంటూ ప్రతిపాదన

కపిలేశ్వరపురం: ఇటీవల వరద ప్రభావానికి కపిలేశ్వరపురం మండలంలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఉద్యాన శాఖాధికారుల సర్వే ప్రకారం 493 మంది రైతులకు చెందిన 1,85.936 హెక్టార్లలోని అరటి, కూరగాయలు, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. మండల ఉద్యాన శాఖాధికారి కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం...కేదారిలంకలో 91 మంది రైతులు 37.228 హెక్టార్లలో అరటి సాగు చేయగా పంట మొత్తంలో 33 పైగా దెబ్బతిన్నది. రూ.9,30,700 ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సిందిగా ప్రతిపాదించారు. 137 మంది రైతులు 54.200 హెక్టార్లలో కూరగాయలు సాగు చేశారు. రూ.9,21,400 నష్ట పరిహారాన్ని ప్రతిపాదించారు. 56 మంది రైతులు 23.592 హెక్టార్లలో బొప్పాయి సాగు చేయగా రూ.4,01,064 పరిహారం ఇవ్వాలంటూ ప్రతిపాదనలు పంపారు. అద్దంకివారిలంకలో 26 మంది రైతులు 11.184 హెక్టార్లలో అరటి సాగు చేయగా రూ.2,79,600, 62 మంది 20.668 హెక్టార్లలో కూరగాయలు సాగు చేయగా రూ.3,51,356, ఒక రైతు 0.608 హెక్టార్లలో బొప్పాయి సాగు చేయగా రూ.10,336 నష్ట పరిహారాన్ని ప్రతిపాదించారు. తాతపూడిలో 18 మంది రైతులు 7.132 హెక్టార్లలో అరటిని సాగు చేయగా రూ.1,78,300, 72 మంది రైతులు 19,920 హెక్టార్లలో కూరగాయలు సాగు చేయగా రూ.3,38,640, 16 మంది రైతులు 5.864 హెక్టార్లలో బొప్పాయి సాగు చేయగా రూ.99,688 నష్ట పరిహారం ఇచ్చేందుకు ప్రతిపాదించారు. కోరుమిల్లిలో 12 మంది రైతులు 4.300 హెక్టార్లలో అరటి సాగు చేయగా రూ.73,100, ఇద్దరు రైతులు 1.240 హెక్టార్లలో కూరగాయలను సాగు చేయగా రూ.21.080, 14 మంది రైతులు 5.540 హెక్టార్లలో బొప్పాయి సాగు చేయగా రూ.94,180 నష్ట పరిహారాన్ని ప్రతిపాదించారు. మండలంలోని పై నాలుగు గ్రామాల పరిధిలో493 మంది రైతులు 185.936 హెక్టార్లలో అరటి, కూరగాయలు, బొప్పాయి పంటలను సాగు చేయగా రూ.36,05,264 నష్ట పరిహారం చెల్లించాలంటూ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

ప్రమాదకరంగా స్కూల్ షెడ్



ఆదుర్రులో శిథిలస్థితికి చేరిన స్కూల్ షెడ్

మామిడికుదురు: ఆదుర్రు గ్రామంలోని బౌద్ధ స్తూపం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల షెడ్ శిథిలస్థితికి చేరింది. వర్షం కురిస్తే చాలు షెడ్ లోపలికి వర్షం నీరు వచ్చి చేరుతోంది. ఈ షెడ్ ఏ క్షణంలో కూలిపోతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీని చుట్టూ బరకాలు కట్టి, షెడ్డుపై భాగంలో టార్పాలిన్ వేశారు. ప్రస్తుతం ఈ షెడ్ లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 23 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా శిథిలస్థితికి చేరిన షెడ్‌ను సోమవారం జిల్లా సమగ్ర శిక్ష ఎఫ్ఏఓ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఈ భవనం పరిస్థితిని డీఈఓ ఎం.కమలకుమారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.మధుసూదనరావుకు ఫోన్‌లో వివరించారు. వారి వెంట ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, హెచ్ఎం తోట రామారావు ఉన్నారు.

ఇంటింటా జాతీయ జెండా ఎగరాలి



ద్వారపూడిలో మహనీయుల విగ్రహాలకు నివాళి



మండపేటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



పందలపాకలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మండపేట: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల వేళ ఇంటింటా జాతీయ జెండాలు ఎగురవేసి దేశం పట్ల, దేశ నాయకుల పట్ల గౌరవాన్ని, భక్తిని చాటాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరామ్ అన్నారు. మండలంలోని ద్వారపూడిలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటిపైనా మూడు రంగుల జెండాలు ఎగుర వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశ మంతటా స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా మండలంలోని గ్రామగ్రామానా తమ ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేసి మన దేశంపై ఉన్న గౌరవాన్ని మరింత పెంచాలని వివరించారు. గ్రామంలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, మహాత్మాగాంధీ విగ్రహాలను మంచి నీటితో శుభ్ర పరిచి పూలమాలలతో అలంకరించారు. కార్యక్రమంలో వల్లభనేని రవీంద్రబాబు, కంకటాల మురళీకృష్ణ, తెల్లాకుల శివప్రసాద్, యరగతపు బాబ్జి, ఎండీ కాలేషా, అడబాల బుల్లబ్బు, మండ వీరభద్రరావు, చింతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న నాయకులు, విద్యార్థులు

డిగ్రీ విద్యార్థుల హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రతి ఒక్కరూ దేశ భక్తిని పెంపొందించు కోవాలని మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ అన్నారు. మారేడుబాకలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి వీరాంజనేయులు, డాక్టర్ నెహ్రూ నాయక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు చేత బూని దేశభక్తి నినాదాలతో ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు కిరణ్‌కుమార్, మధుకుమార్, రామకృష్ణ, చంటిబాబు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.


ఉత్సాహంగా మానవహారం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థుల్లో జాతీయ సమైక్యతను పెంపొందించాలనే సంకల్పంతో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు త్రివర్ణ పతాకాలను చేతపట్టి వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. పాఠశాల వ్యాయామ దర్శకులు ద్వారంపూడి యువరాజారెడ్డి ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోని పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్ర స్ఫూర్తిని, మహనీయుల త్యాగాలను ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో విద్యార్థుల ర్యాలీ

రామచంద్రపురం రూరల్: దేశ 78వ స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా ప్రధానమంత్రి సూచించిన విధంగా హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 100 మందితో కలసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటిపైనా, ప్రతి కార్యాలయంపైనా స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాలను ఎగుర వేయాలని ప్రజలను కోరుతూ నినాదాలు చేశారు. భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షుడు తోలేటి సూర్యగంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ అనకాపల్లి ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, పట్టణ అధ్యక్షుడు కేశవ రాఘవేంద్ర, నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రొక్కాల సత్తిబాబు, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గాజాల కల్యాణ్, పట్టణ అధ్యక్షుడు మణికంఠ సత్యపవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా గాంధీ పెయింటింగ్



శ్రీనివాస్ తీర్చిదిద్దిన గాంధీ ఆయిల్ పెయింటింగ్

మామిడికుదురు: భారత జాతిపిత మహాత్మాగాంధీ ఆయిల్ పెయింటింగ్‌ను ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ అద్భుతంగా తీర్చిదిద్దారు. భారత స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గాంధీతో పాటు శాంతి చిహ్నం పావురం, మువ్వన్నెల జెండా, దేశ సైనికుల చిత్రాలతో కూడిన ఆయిల్ పెయింటింగ్‌ను విద్యార్థుల సమక్షంలో శ్రీనివాస్ ఆకట్టుకునేలా చిత్రీకరించారు. ఈ చిత్రం వీక్షకులను అబ్బుర పరుస్తోంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు టీచర్ శ్రీనివాస్‌ను అభినందనలతో ముంచెత్తారు.